క్లుప్తంగా

వైజ్ఞానిక సదస్సులో పాల్గొన్న డాక్టర్ అనురాగ్



గుంటూరు మెడికల్: ట్రాన్స్‌కాథెటర్ కార్డియోవాస్కులర్ థెరప్యూటిక్స్ (టీసీటీ) 2024 సమావేశం వాషింగ్టన్, డీసీలోని వాల్టర్ ఈ వాషింగ్టన్ కన్వెన్షన్ సెంటర్‌లో అక్టోబర్ 27 నుంచి అక్టోబరు 30 వరకు జరిగింది. ఈ నాలుగు రోజుల వైజ్ఞానిక సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా పదివేల మంది కార్డియాలజిస్టులు, 1,400 మంది ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. సదస్సులో ఎండోవాస్క్యులర్, స్ట్రక్చరల్, కరోనరీ ఇంటర్వెన్షన్స్ కవర్ చేసే 33 కేసులను సదస్సులో ప్రత్యక్ష ప్రసారం చేశారు. గుంటూరులోని లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో ఎండోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ పోలవరపు, 'చాలెంజింగ్ ఇంటర్వెన్షన్ ఇన్ ఎ కేసు ఆఫ్ లెఫ్ట్ హ్యాండ్ అక్యూట్‌లింబ్ ఇష్కీమియా' ఆర్డరీ ఇన్ ది షాడోస్ అనే అంశంపై సదస్సులో మాట్లాడారని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రాఘవ శర్మ శనివారం తెలిపారు. టీసీటీ 2024 ఈ సంవత్సరం థీమ్ 'ఇంటర్వెన్షనల్ మీన్స్ ఆఫ్ ప్రివెన్షన్' అంటే తొలి దశ లోనే లక్షణాలు కనిపించని పేషంట్లకు ముందుస్తు ఇంటర్వెన్షన్ చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చు అన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అపార అవకాశాలు

డీఈఓ సీవీ రేణుక



గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం టెన్త్ విద్యార్థులకు విజ్ఞాన్ వర్సిటీ సహకారంతో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈఓ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల విద్య అనంతరం కళాశాల చదువు, భవిష్యత్తులో ఏఏ కోర్సుల్లో ఎటువంటి ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయనే సమాచారంతో దిశా నిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ విజ్ఞాన్ వర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్గ, విద్యార్థుల బృందం పాఠశాలలోని విద్యార్థినులకు భవిష్యత్తు అవకాశాలపై చక్కటి అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం, సమగ్రశిక్ష ఏఎల్‌సీ సి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలానాల పేరుతో దోపిడీపై కమిషనర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో టపాసుల దుకాణాల వద్ద ప్రజారోగ్యధికారులు ఒక్కో దుకాణం నుంచి వెయ్యి నుంచి రూ.1500 దాకా వసూలు చేసిన అంశంపై 'సాక్షి' 'చలానాల పేరుతో దోపిడీ' శీర్షిక శనివారం ప్రచురితమైంది. దీనిపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సీరియల్ అయినట్లు తెలిసింది. వెంటనే దీనిపై విచారణ చేపట్టి ఎవరు ఎన్ని చలానాలు ఇచ్చారో ఎంత మొత్తం కార్పొరేషన్‌కు జమ అయింది.. వంటి సమగ్ర వివరాలతో తమకు పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని ప్రజారోగ్యధికారులను ఆదేశించినట్లు సమాచారం.

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్



లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నవంబర్ 6 తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ధర్నా పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థి దీవెన వసతి దీవెనలు వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులకు మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.3,000లకు పెంచాలని, మెడికల్ సీట్ల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని, 107,108, జీఓలను వెంటనే రద్దు చేయాలని కోరారు. గుంటూరు నగరంలోని కోడిగుడ్డు సత్రం హాస్టల్ వెంటనే ప్రారంభించాలని, కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆదివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో కళాశాలలు నిర్వహించకుండా చూడాలని డిమాండ్లతో కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, ఉదయరాజు, గోపి పాల్గొన్నారు.

అన్నీ మర్చిపోతున్నారంటే...

అల్జీమర్స్... బీ కేర్‌ఫుల్

వ్యాధి సోకితే తమ పేరుకూడా మర్చిపోతారు

- పెరుగుతున్న వ్యాధి బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- నవంబర్ అల్జీమర్స్ అవగాహన నెల ఇది

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల మతిమరుపు బాధితుల సంఖ్య ప్రతిఏడాది పెరిగిపోతుంది. వయస్సు పెరుగుతున్న కొద్ది మతిమరుపు రావటం సహజం. దీనినే అల్జీమర్స్ వ్యాధి అంటారు. ఆరోగ్య సంస్థల నివేదిక ప్రకారం ప్రతి 32 సెకన్లకు ఒకరు ఈవ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జబ్బు సోకిన వారికి సహాయకులుగా ఉండేవారికి అవగాహన కల్పించటం కోసం 1983 నుంచి ప్రతి ఏడాది నవంబర్ నెలను అల్జీమర్స్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నారు.

ఎలా వ్యాధి బారిన పడుతున్నారంటే..

ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి కొంతదూరం వెళ్ళాక ఇంటి అడ్రస్ మర్చిపోవటం, తన పేరు కూడా రోగి మర్చిపోయే స్థితికి చేరుకోవటం ఈ జబ్బు లక్షణం. ఆధునిక జీవనశైలి వలన ప్రతి విషయాన్ని కూడా స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్స్‌లో ఆన్‌లైన్‌లోనే వెతుకుతూ మెదడును ఏ మాత్రం వాడకుండా లేజీగా వదిలివేయటంతో వ్యాధి బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వ్యాధి వచ్చాక బాధపడటం కంటే రాకుండా ముందస్తుగా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం చాలా ఉత్తమం. నియంత్రణే తప్పా నివారణ లే నిది ఈ వ్యాధి.

వ్యాధి లక్షణాలు...

అల్జీమర్స్ వ్యాధి సోకిన వారు తమ పేరు కూడా మర్చిపోతారు. బంధువుల, కుటుంబ సభ్యుల పేర్లు మర్చిపోవటంతోపాటుగా వారిని గుర్తించటం కూడా కష్టమే. ఈ వ్యాధి ఎక్కువగా 60 సంవత్సరాలు దాటిన వారిలో వస్తోంది. నేడు 40 ఏళ్ల వారిలో కూడా వ్యాధి లక్షణాలు కనిపించటం ఆందోళన కలిగిస్తోంది.



అల్జీమర్స్ మాసం పోస్టర్

వ్యాధి రావటానికి కారణాలు....

వ్యాధి రావటానికి జన్యుపరమైన కారణాలు, కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా వచ్చే అవకాశం ఉంది. జీవనశైలిలో మార్పులు, నిద్రలేమి, ఒత్తిడికి గురవ్వటంతోపాటుగా బీపీ, షుగర్, గుండెజబ్బు లాంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితులతో వ్యాధి బారిన పడుతున్నారు.

రోజువారి పనులు కష్టమే....

వ్యాధి గ్రస్తులు రోజు వారి కార్యక్రమాలు మర్చిపోతారు. స్నానం చేయటం, బ్రష్ చేయటం, తిండి తినటం కూడా మర్చిపోతారు. వస్తువులను ఎక్కడో పెట్టి ఆ విషయాన్ని మర్చిపోయి ఎవరో దొంగిలించినట్లుగా అనుమానించటం, చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పటం, వస్తువుల పేర్లు మర్చిపోవటం, వాటిని ఏ విధంగా వినియోగించాలో, ఎందు నిమిత్తం వినియోగించాలో అనే అంశాలను మర్చిపోవటం రోగిలో కనిపిస్తాయి.

ఇంటికి తాళాలు వేయటం, కూరలో ఉప్పువేయటం, పాలల్లో తోడు వేయటం వంటివి మర్చిపోవటం వ్యాధి గ్రస్తుల్లో కనిపిస్తాయి.

జీజీహెచ్‌లో మెమరీ క్లీనిక్...



అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులకు జీజీహెచ్ న్యూరాలజీ ఓపీ వైద్య విభాగంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతిరోజూ పది మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. వ్యాధిని పెరగనీయకుండా చేయటం తప్పా పూర్తిగా తగ్గించేందుకు మందు లేదు. జిల్లాలో 25 మంది న్యూరాలజిస్టులు ఉండగా ప్రతిరోజూ ఒక్కొక్కరి వద్ద ఇరువురు అల్జీమర్స్ చికిత్స కోసం సంప్రదిస్తున్నారు.

–డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ వైద్య విభాగాధిపతి, జీజీహెచ్.

ముందు జాగ్రత్తలే మేలు.....



వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఏదైనా కొత్త విషయాలపై ఆసక్తి చూపాలి. పుస్తకాలలో, న్యూస్ పేపర్స్‌లో, మ్యాగ్జైన్‌లలో కనిపించే పజిల్స్‌పూర్తి చేయాలి, హాబీలు కొనసాగించటం, బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, మత్తుపదార్థాల జోలికివెళ్లకుండా ఉండటం, క్రమం తప్పకుండా ఆహారపు అలవాట్లు పాటించటం ద్వారా ఈవ్యాధి దరిచేరనీయకుండా చేయవచ్చు.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్టు, గుంటూరు

దళిత క్రైస్తవులకు శ్మశాన వాటిక కేటాయించాలి



నెహ్రూనగర్: దళిత క్రైస్తవులకు అవసరమైన శ్మశాన వాటికలు లేవని, వాటి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్ల మూడి రాజసుందరబాబు, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖజావలికి విన్నవించారు. డీఆర్వోగా విధుల్లో చేరిన ఖజావలికి శనివారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా విధుల్లో చేరిన ఖజావలికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల అసోసియేషన్ నాయకులు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చింతల రాజ్‌కుమార్, బుల్లియ్య, శ్రీనివాస్, సాంబశివరావు, శ్రీనివాసరావు, ఖజా పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు దరఖాస్తుల పరిశీలన

నెహ్రూనగర్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న ఓటర్ల దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్ఓలు ఆదివారం నుంచి వస్తారని అవసరమైన పత్రాలు అందించి సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటరుగా అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో ఫారం–18 ద్వారా దరఖాస్తు చేశారని, ఆయా దరఖాస్తులను క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్ఓలు వస్తారని తెలిపారు.

ఉరిమే ఉత్సాహం



దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు



హాజరైన నాయకులు, కార్యకర్తలు



కాకాని రోడ్డులో యువకుల బైక్ ర్యాలీ

వైఎస్సార్ సీపీ శ్రేణులు నగరంలో కదంతొక్కాయి. నగరం పులకించిపోయింది. పార్టీ అగ్రనాయకులు రాకతో ఉత్సాహం ఉరకలెత్తింది. అడుగడుగునా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఆనందోత్సవాల మధ్య వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా వనమా బాలవజ్రబాబు ప్రమాణస్వీకారం చేశారు.

-పట్నంబజారు

రోడ్ల నిర్వహణ బాధ్యత ఏడాది పాటు కాంట్రాక్టర్లదే

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేర మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీలో భాగంగా కాంట్రాక్టర్లు ఏడాది పాటు తాము పూడ్చిన గుంతలకు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శనివారం గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని శాసన సభ్యులు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, జీఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ పరిదిలో హిమని జంక్షన్ నుంచి వి.జంక్షన్ వరకు ఉన్న రోడ్లకు రూ.22 లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్‌కు రూ.18 లక్షలకు వర్క్ ఆర్డర్ ఇచ్చామన్నారు. 5.1 కిలో మీటర్ల పొడవు ఉన్న రోడ్ల గుంతలను పూడుస్తారన్నారు. దీంతోపాటు ఆర్అండ్‌బీ ఫేజ్–1లో రూ.13.36 కోట్లు పనులకు అనుమతులు మంజూరయ్యాయన్నారు. వీటిని 49 రోడ్లకు టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో రూ.38 లక్షల విలువైన రోడ్ల గుంతల పూడ్చే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రారంభమైన పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేసి ఏడాది పాటు కాంట్రాక్టర్ రోడ్ల పనులు సమీక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, ఈఈ విశ్వనాథ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యే నసీర్

ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ

నెహ్రూనగర్: ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్దేశిత గడువులోగా అందించడంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. తాగునీటి ట్యాప్ కనెక్షన్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై ముగ్గురు ఏఈలు, నలుగురు వార్డ్ అడ్మిన్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీలను అధికారులు తప్పనిసరిగా సర్వీస్ లెవల్ అగ్రిమెంట్(ఎస్ఎల్ఏ) మేరకు నిర్దేశిత గడువు 15 రోజులులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను ఎస్ఎల్ఏ లోపు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావు, బి.చైతన్యలకు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులు వి.రాంబాబు నాయక్, ఎస్.నాగరాజు, ఎ.వెంకటేశ్వర్లు, ఎన్.వేణుగోపాల్ రావులకు క్రమశిక్షణ చర్యలు, పెనాల్టీ విధింపు ఎందుకు చేపట్టకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు చెప్పారు.

సంతానరాహిత్యంపై అవగాహన కోసం వాక్‌థాన్

గుంటూరు మెడికల్: ప్రపంచ సంతానసాఫల్య దినోత్సవం సందర్భంగా గుంటూరు నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో శనివారం సంతానరాహిత్యంపై అవగాహన కల్పిస్తూ ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, వికాస్ ఆస్పత్రి డైరెక్టర్ గల్లా మాధవి జెండా ఊపి వాక్‌థాన్ ప్రారంభించారు. వంద మందికి పైగా నర్సింగ్ కాలేజ్ విద్యార్థినులు, నోవా ఐవీఎఫ్ సిబ్బంది, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా 5 కిలోమీటర్ల పాటు నడిచి సంతానరాహిత్యంపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గుంటూరులోని నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ ఒక సమగ్ర సంతానసాఫల్య చికిత్సా కేంద్రం అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రయోగశాలలు ఉన్నాయి వెల్లడించారు. సంతానసాఫల్య చికిత్సలను అందించడానికి ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరిస్తారని తెలిపారు. అనంతరం గుంటూరు జోసెఫ్ నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ మిస్ విక్టోరియా, గుంటూరుకు చెందిన కన్సల్టెంట్ గైనకాలజిస్టు, అబ్స్టెట్రీషియన్ డాక్టర్ నూతక్కి సుజాత, గుంటూరులోని ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ అర్చనలను సత్కరించారు. కార్యక్రమంలో జోసెఫ్ నర్సింగ్ కాలేజి, టీజేపీఎస్ డిగ్రీ కాలేజి, గోరంట్ల సెయింట్ ఆన్స్ కాలేజి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

కార్తిక సందడి

కార్తిక మాసం ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. నగరంలో కార్తిక సందడి సంతరించుకుంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



అరండల్‌పేట శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, దర్శించుకుంటున్న భక్తులు



పాత గుంటూరు శివాలయంలో క్యూలైనులో భక్తులు

డిసెంబర్ 15 నాటికి ప్యాచ్ వర్క్స్ పూర్తి చేయాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డిసెంబర్ 15 నాటికి రోడ్ల ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని, అందులో భాగంగా ఇప్పటి వరకు గుర్తించి మూడు వేల ప్యాచ్ వర్క్‌ల్లో సుమారు 500 వర్కులు పూర్తి చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కలిసి పాత గుంటూరు బాలాజీ నగర్ మెయిన్ రోడ్ మరమ్మతులు ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ప్రజలు గోతులతో కూడిన రోడ్ల వలన తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, నగరపాలక సంస్థ అధికారులు నియోజకవర్గంలోని రోడ్లను పరిశీలించి, గోతులు సరి చేయడం, బాగా పాడైన వాటికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.జ్యోతి, వై.అశోక్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్మికులు పారిశుద్ధ్య విధులు మాత్రమే నిర్వహించాలి

గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులు పారిశుద్ధ్య పనులు కాకుండా ఇతర విధుల్లో ఉంటే తక్షణం వారిని ఆయా శానిటరీ డివిజన్లలో పారిశుద్ధ్య విధులు కేటాయించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శనివారం నాజ్ సెంటర్, నల్లచెరువు మస్టర్ పాయింట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత కార్మికుల, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి, మాట్లాడుతూ నగరంలో ప్రజారోగ్య కార్మికులు పారిశుద్ధ్య పనులు కాకుండా ఇతర విధుల్లో ఉంటున్నారని, అటువంటి వారిని తక్షణం ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య విధులు కేటాయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. పర్యటనలో శానిటేషన్ ప్రత్యేక అధికారులు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఎస్ అయూబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంగడి వెంకటేశ్వరరావు, దాసరి ఏడుకొండలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో వైఫల్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలకు సకాలంలో నోటిఫికేషన్లు విడుదల చేసి, ఉద్యోగ నియామక పరీక్షలను నిర్వహించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కృష్ణా- గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. పొన్నూరురోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

డిసెంబర్ 10న బాలల లలిత కళా ఉత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న బాలల లలిత కళా ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్.మంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల వ్యవస్థాపకురాల్లో ఒకరైన గరిగె ప్రభావతి స్మృతి దినోత్సవం సందర్భంగా గత 29 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ లలిత కళల్లో ప్రతిభావంతులైన బాలలకు ప్రతిభా పల్లవం పురస్కారంతో పాటు బాల సాహితీ సృజనకర్తలకు మంగాదేవి బాల సాహిత్య పురస్కారం, సాహిత్య రంగానికి సేవలందిస్తున్న మహిళలకు మాలతీ ప్రమదా సాహితీ పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. విద్యార్థులకు గాత్ర, వాద్య సంగీతంలో వ్యక్తిగత, బృందగానాలతో పాటు చిత్ర లేఖన, కథా రచన, లేఖారచనలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 0863-2232405, 9390115480, 7729967589, 8121590409 ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఇతర వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌వీబీకేటీ.ఇన్ సైట్ నుంచి పొందాలని తెలిపారు.